
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట 5
శనివారం 20 జూలై 2024





శాకంబరిగా విద్యాసరస్వతీ అమ్మవారు

వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మూలమహోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలనక్షత్రం, ఆషాడమాసం సందర్భంగా శాకంబరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో పూజలు నిర్వహించారు. భక్తులు లక్ష పుష్పర్చణతో పాటు లక్ష ద్రాక్ష అర్చనలు, ఆలయ యాగశాలలో చండీ హోమం చేశారు.

- వర్గల్, జూలై 19

అందోలు ఫస్ట్..
...నెక్స్ట్ హుస్నాబాద్, దుబ్బాక

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రుణమాఫీ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా రైతులకు రూ.900 కోట్ల లబ్ధి చేకూరింది. రూ.లక్ష వరకు రుణాలు పొందిన రైతుల ఖాతాల్లో ఈ నిధులు జమయ్యాయి. గురువారం సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి దాకా రైతుల సెల్‌ఫోన్లకు రుణమాఫీకి సంబంధించి మెసేజ్‌ల మోత మోగింది. ముందురోజు విడుదల చేసిన జాబితాలో పేర్లున్న వారందరికీ ప్రయోజనం చేకూరినట్లుగా తెలుస్తున్నది. రెండు, మూడో విడతలకు సంబంధించిన రైతు కుటుంబాలు, వారి ఖాతాలపై సంబంధిత అధికారులు దృష్టిసారించారు.

- రూ.లక్ష వరకు రుణమాఫీలో ముందంజ
- రాష్ట్రంలోని తొలి రెండు స్థానాలు మనవే
- ఉమ్మడి జిల్లా రైతులకు రూ.900 కోట్ల లబ్ధి
- మెతుకుసీమకే అధిక ప్రయోజనం
- రెండు, మూడో విడత ఖాతాల పరిశీలన

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 19: సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల పరిధిలో దాదాపు 5 లక్షల మంది రైతులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందారు. సుమారు 1.60 లక్షల మంది రైతులు రూ.లక్ష వరకే రుణాన్ని తీసుకున్నారు. మిగతా వారంతా రూ.2లక్షల లోపు రుణజాబితాలో ఉంటారు. ఒక కుటుంబంలో నలుగురి పేరిట రూ.2లక్షల రుణం ఉంటే వారి పేర్లు తాజా జాబితాలో రాలేదు. వీరిని రూ.2 లక్షల రుణ జాబితాలో చేర్చినట్లుగా తెలుస్తోంది. ఫలితంగా రైతుల సంఖ్యతోపాటు రుణమాఫీ మొత్తం భారీగా పెరగనున్నది. గురువారం జరిగిన మాఫీతో పోల్చితే నాలుగింతలు ఎక్కువయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నియోజకవర్గం	కుటుంబాలు	రైతుల ఖాతాలు	మాఫీ రూ.కోట్లలో
అందోల్	19,186	20,216	107.83
హుస్నాబాద్	18,101	18,907	106.74
దుబ్బాక	17,811	19,986	101.29
నారాయణఖేడ్	16,524	17,265	94.70
నర్సాపూర్	17,427	18,542	89.87
మెదక్	17,092	18,308	89.00
గజ్వేల్	15,383	16,220	84.21
జనగామ	11,522	11,954	69.04
జహీరాబాద్	9,140	9,414	56.66
సిద్దిపేట	8,527	9,022	50.18
సంగారెడ్డి	7,189	7,528	39.21
పటాన్‌చెరు	2,734	2,843	14.38

మెతుకుసీమకే అధిక నిధులు

తొలివిడత రుణమాఫీ కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.6,100 కోట్లను విడుదల చేశారు. రూ.లక్ష వరకు రుణం తీసుకున్న వారందరి ఖాతాల్లోనూ ఈ నిధులు జమ చేశారు. ఇందులో రూ.900 కోట్లు ఉమ్మడి మెదక్ జిల్లాకే కేటాయించారు. రాష్ట్రంలో అత్యధిక రుణాలు మాఫీ అయిన నాలుగు నియోజకవర్గాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన 3 నియోజకవర్గాలు ఉన్నాయి. తొలి రెండు స్థానాల్లో అందోల్, హుస్నాబాద్ ఉండగా.. 4వ స్థానంలో దుబ్బాక ఉంది. రూ.వంద కోట్లకు పైగానే ఈ నియోజకవర్గంలోని రైతులకు లబ్ధి చేకూరింది. పారిశ్రామిక ప్రాంతమైన పటాన్‌చెరు నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలో చిట్టచివరగా నిలిచింది. ఇక్కడ కేవలం రూ.14.38 కోట్లు మాత్రమే రుణమాఫీ జరిగింది. సిద్దిపేట నియోజకవర్గ రైతులకు కేవలం రూ.50 కోట్లే లబ్ధి చేకూరింది.

లక్ష దాటినవారికి వచ్చే రెండు విడతల్లో..

తొలి విడతలో ఒక్కో కుటుంబానికి రూ.లక్ష వరకు రుణాలు మాఫీ అయ్యాయి. ఇందులో ఎక్కువగా కుటుంబంలో ఒకే రైతు ఉన్నవారే. కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ రైతులు ఉన్న కుటుంబాలు రూ.లక్ష కంటే ఎక్కువ రుణాలు ఉన్న జాబితాలో ఎక్కువగా ఉన్నారు. రెండో విడతలో రూ.1.50 లక్షల వరకు, మూడో విడతలో రూ.2లక్షల వవరకు రుణాలను మాఫీ చేయనున్నారు. మొదటివిడతను విజయవంతంగా పూర్తి చేయడంతో ప్రస్తుతం రెండోవిడతపై దృష్టి సారించారు. ఒక కుటుంబంలో రూ.1.50 లక్షల వరకు రుణం పొందిన వారి ఖాతాలను గుర్తిస్తున్నారు. పాస్‌బుక్‌ను ప్రామాణికంగా చేసుకుని వారి జాబితాను జల్లెడ పడుతున్నారు. ఇప్పటికే ఇలాంటి ఖాతాలపై ఒక అంచనాకు వచ్చారు. విమర్శలకు తావు లేకుండా ముందు జాగ్రత్తగా నిశితంగా పరిశీలిస్తున్నట్టు అధికారుల వర్గాలు పేర్కొంటున్నాయి.


రుణమాఫీకి సంబంధించిన మెసేజ్‌ను చూసుకుంటున్న రైతులు


దొమ్మాట బ్యాంకులో రైతుల వివరాలను పరిశీలిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్


వర్గల్ మండలం మైలారం గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

రెండో రోజు ప్రశాంతం

- 24 మంది గైర్హాజరు

సిద్దిపేట క్రైం, జూలై 19: సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం రెండోరోజు డీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పొన్నాల శివారులోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఉదయం జరిగిన పరీక్షకు 50 మందికి గాను 45 మంది, సాయంత్రం 51 మందికి 50 మంది హాజరయ్యారు. పట్టణంలోని వెరిటస్ అండ్ వెర్దస్ సెంటర్‌లో ఉదయం 150 మందికి గాను 138 మంది, సాయంత్రం 150 మందికి గాను 144 మంది హాజరయ్యారు. రెండు సెంటర్లలో కలిపి 24 మంది గైర్హాజరయ్యారు.


అసంపూర్తిగా డైనింగ్ హాల్, కిచెన్‌షెడ్

పాతబడి పోయింది..!

- 77 ఏళ్ల నాటి మద్దూరు హైస్కూల్‌పై నిర్లక్ష్యం
- నిధులున్నా..ముందుకు సాగని పనులు

7

ఊరించి.. ఉసూరుమనిపించి..

- నిత్యం కమ్ముకుంటున్న మబ్బులు
- అయినా... కరుణించని వరుణుడు
- ముదురుతున్న నార్లు.. వెక్కిరిస్తున్న పొలాలు!
- వర్షాల కోసం అన్నదాతల ఎదురుచూపు


చేర్యాలలో దట్టంగా కమ్ముకున్న మబ్బులు

చేర్యాల/అక్కన్నపేట జూలై 19 : కోటి ఆశలతో రైతులు ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేస్తున్నా.. వరుణుడు మాత్రం మొహం చాటేస్తున్నాడు. సీజన్ ప్రారంభం నుంచి నిత్యం ఆకాశంలో దట్టంగా మబ్బులు కమ్ముకుని ఊరిస్తున్నాయే తప్ప చుక్కనీరు రాల్చడం లేదు. పొరుగుమండలాల్లో వర్షాలు కురుస్తున్నా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలలో వరుణుడు దోబూచులాడుతున్నాడు. మెట్టప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలో ఆశించిన మేర వర్షాలు కురవక నార్లు ముదిరిపోతున్నాయి. చెరువులు కుంటలు బోసిపోతున్నాయి. రెండు, మూడురోజులుగా చిరుజల్లులు మాత్రమే పడుతుండడంతో మెట్టప్రాంత రైతుల ఆశలు అడియాశలవుతున్నాయి. బావులు, బోర్లలో నీటిమట్టం పూర్తిగా తగ్గిందని, పొలం దున్నేందుకు నీళ్లు పెడితే పారడం లేదని ఆవేదన చెందుతున్నారు. హుస్నాబాద్ డివిజన్‌లోని కుంటలు, చెరువులన్నీ వెలవెలబోతున్నాయి. చెరువులు, కుంటలు నిండితే ఆయకట్టు రైతులు సాగుచేస్తారు. వర్షాలు లేకపోవడంతో నార్లు పోసుకుని వరుణుడి కోసం ఎదురుచూస్తున్నారు. చేర్యాలతో పాటు ఆయా మండలాలో అధికంగా పత్తిని సాగుచేశారు. గతంలో కన్నా తక్కువస్థాయిలోనే మక్కవేయగా ఆది నుంచి పంటల ఎదుగుదల ఆశించిన మేర ఉంది. అయితే, కొద్దిరోజుల నుంచి వానలు కురవక వాలిపోతున్నాయి. పలువురు పత్తిచేలను కాపాడుకునేందుకు నీటిని పడుతున్నారు. మరికొందరు స్ప్రింక్లర్లను వినియోగిస్తున్నా.. ఒకింత ఆందోళన చెందుతున్నారు. వర్షాలు లేకపోవడంతో పంటలు దక్కించుకునేందుకు రైతాంగానికి గోదావరి జలాలే దిక్కుగా మారాయి. గతంలో రిజర్వాయర్‌ను వేసవిలోనూ పంపింగ్ చేపట్టి చెరువులు, కుంటలను నింపడంతో రైతుల్లో భరోసా కలిగేది. కానీ కొన్నాళ్లుగా రిజర్వాయర్‌కు పంపింగ్ నిలిచిపోవడం, తద్వారా చెరువులకు మళ్లించకపోవడంతో నీటి మట్టం అడుగంటింది. ప్రస్తుతం ఎగువ ప్రాంతంలో కురిసిన వరద గోదావరికి వస్తున్న క్రమంలో పంపింగ్ చేపట్టి రిజర్వాయర్‌ను నింపి చెరువులు, కాలువల ద్వారా సాగునీటినందించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


అక్కన్నపేట మండలం అంతకపేటలో ముదురుతున్న వరినారు


సరైన నీరు అందక వాలిపోతున్న మొక్కజొన్న చేను


చేర్యాల మండలపరిధిలో ఎండిపోకుండా పత్తిమొక్కలకు నీరుపోస్తున్న రైతులు

నీరు లేక నాట్లు వేయలేదు



- దాసరి చంద్రయ్య, చేర్యాల

సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా చినుకు జాడలేదు. రెండు ఎకరాలకోసం నారు పోశాం. నీరు లేక వర్షం కోసం ఎదురుచూస్తుండటంతో నారుముదురిపోయింది. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

చేలు వాలిపోతున్నాయి



- బీర్ల నర్సయ్య, చేర్యాల

నేను మక్క, పత్తి రెండు పంటలు వేశాను. ప్రస్తుతం మొలక దశలో ఉన్నవి. కానీ వర్షం కురవకపోవడంతో చేలు వాలిపోతున్నాయి. వర్షం కోసం దేవుళ్లను మొక్కుతున్నాం. కాలం కాక , పంటలు ఎండిపోతే కష్టంగా ఉంటుంది.

నారుపోసి 40 రోజులవుతుంది

- గుగులోతు దుర్గయ్య నాయక్, చాపగాని తండా, అక్కన్నపేట



నాలుగు ఎకరాల్లో సాగుకు నారు పోసి 40 రోజులు అవుతుంది. పొలం దున్నడానికి నీరు లేక వర్షాల కోసం ఎదురుచూస్తున్నాం. నారు ముదిరిపోతుంది. బోరు బావిలో నీటి మట్టం తగ్గడంతో నీళ్లు ఎక్కువ పోయడం లేదు. వర్షాలు కురిస్తేనే పొలం దున్నడానికి వీలవుతుంది.

ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 19: ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ మనుచౌదరి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జిల్లాలో బదిలీ అయిన 110 మంది గ్రేడ్ -4 పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బదిలీ ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర చాలా ముఖ్యమైనదని చెప్పారు. గ్రామాలలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలతో పాటు ఇతరత్రా ప్రభుత్వ ప్రాధాన్యత అన్ని విధులను నూతనంగా చేరపోయే గ్రామపంచాయతీలలో సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, డివిజనల్ పంచాయతీ అధికారి మల్లికార్జున్, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శులకు బదిలీ ఉత్తర్వులను అందజేస్తున్న కలెక్టర్ మను చౌదరి

చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం

- చైర్‌పర్సన్‌గా నల్లనాగుల శ్వేత, వైస్ చైర్మన్‌గా కామిడి జీవన్‌రెడ్డి

చేర్యాల, జూలై 19 : చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. చైర్మన్ స్థానం బీసీ మహిళకు రిజర్వు కావడంతో జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూరుకు చెందిన నల్లనాగుల శ్వేతకు అవకాశం కల్పించారు. వైస్‌చైర్మన్‌గా మద్దూరు మండలం సలాక్‌పూర్‌కు చెందిన కామిడి జీవన్‌రెడ్డి, డైరెక్టర్లుగా ఇర్రి రాంరెడ్డి, ఆసర్ల అంజయ్య, అర్జుల పోశిరెడ్డి, వంగ కృష్ణారెడ్డి, భైతి శ్రీనివాస్, ధరావత్ లక్ష్మి, సింగపాక కుమార్, చల్లా అండాలు, బండారి కనకయ్య, భైరగోని భానుప్రకాశ్, పాల లక్ష్మీనారాయణ, తడక లింగమూర్తితో పాటు నర్మెట్ట పీఏసీస్ చైర్మన్, సిద్దిపేట డీఎంవో, చేర్యాల ఏడీఏ, మునిసిపల్ చైర్‌పర్సన్లను నియమించారు. కమిటీ పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. కమిటీ నియామకంలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తన విధేయులకు పట్టం కట్టారని, పని చేసే వారికి పదవులు ఇచ్చారని అంటున్నారు.


నల్లనాగుల శ్వేత


కామిడి జీవన్‌రెడ్డి

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

- యువకుడు మృతి.. మరొకరి పరిస్థితి విషమం

7


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

హాస్టల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు చెల్లించాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌కు విన్నవించిన సిబ్బంది
- తక్షణమే 7 నెలల జీతాలు చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్

7

కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకునే పార్టీ

7

- రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు


మాట్లాడుతున్న హన్మంతరావు


ఎలాంటి హెచ్చరికలు లేని జాతీయ రహదారి పక్కన అండర్ పాస్

పట్టు తప్పిందా.. ప్రాణాలు గోవిందా!

మాసాయిపేట, జూలై 19 : మాసాయిపేట మండలం బొమ్మారం చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిని ఆనుకుని నిర్మించిన అండర్‌పాస్ వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. పలు గ్రామాల ప్రజలు గతంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయగా ఇటీవలనే దీని నిర్మాణం పూర్తి చేశారు. అయితే, సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి సైన్ బోర్డులను ఏర్పాటు చేయలేదు. భారీ వాహనాలు హైవేపై నుంచే 24 గంటలు వెళుతుంటాయి. అటువైపుగా వెళ్లే వాహనదారులు ఈ అండర్‌పాస్ ఉందనే విషయం గమనించకపోతే ప్రమాదాలు తప్పవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

దొరల రాజ్యం పోయి... దొంగల రాజ్యం వచ్చింది

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

సిద్దిపేట క్రైం, జూలై 19 : రాష్ట్రంలో దొరల రాజ్యం పోయి దొంగల రాజ్యం వచ్చిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్లు, బిల్డర్ల నుంచి తీసుకునే కమిషన్ల పార్టీగా మారిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజల పరిస్థితి పెనంలో నుంచి పొయిలపడ్డట్లు అయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని స్థిరత్వం చేయడానికి ప్రణాళికలు లేకుండా పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. ఏడు నెలలు గడిచిన సగం రోజులు ఢిల్లీకి వెళ్లి రావడం సరిపోయిందని, ప్రజల సమస్యల పట్ల పాలన కొనసాగించ లేదన్నారు. రైతుల రుణమాఫీ తూతూ మంత్రంగా ప్రారంభించారని రూ.64 వేల కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా కేవలం రూ.6,800 కోట్లు మాఫీ చేసి పాలాభిషేకాలతో సంబరాలు చేసుకుంటున్నారని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ చోట బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వంగ రామచంద్రారెడ్డి, విద్యాసాగర్‌రావు, విభూషణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఎంపీడీవో కార్యాలయం

● అపరిశుభ్రంగా పరిసరాలు
● సమయపాలన పాటించని సిబ్బంది

కంది, జూలై 17 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం అస్తవ్యస్తంగా తయారైంది. కందిలో 65 నంబరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పాత జడ్పీహెచ్‌ఎస్‌లో ఎంపీడీవో కార్యాలయం కొనసాగుతున్నది. మండలం ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ ఎంపీడీవో కార్యాలయం సరైన వసతులకు నోచుకోవట్లేదు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు కలిపి 48 వేలకు పైగా జనాభా ఉన్నప్పటికీ ఈ కార్యాలయంలో ఉండాల్సిన అటెండర్‌కు రెగ్యులర్ పోస్టు లేకపోవడం గమనార్హం. అంతేగాక కార్యాలయం ఊడ్చడానికి స్వీపర్, రాత్రిపూట కాపల ఉండేందుకు వాచ్‌మెన్ లేరు. సమావేశాల కోసం ఓ మీటింగ్‌హాలు అందుబాటులో లేదు. కార్యాలయం ఆవరణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయకపోవడంతో కంప్యూటర్లు, రికార్డులకు భద్రతకు కరువైంది. మూడు నెలల క్రితం ఈ కార్యాలయంలో దొంగలు పడి టాయిలెట్లలోని నల్లాలను చోరీ చేశారు. అదిగాక ఎంపీడీవో కార్యాలయంలో స్వీపర్ లేకపోవడంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. కార్యాలయం చుట్టూ చెట్లు ఉండడంతో చెట్ల నుంచి రాలే ఆకులు, పూతతో ఆవరణ మొత్తం నిండిపోయి ఉంటుంది. వర్షం పడితే చాలు చిత్తడిగా మారుతుంది.

11 దాటిన తర్వాత కార్యాలయానికి..

ఎంపీడీవో కార్యాలయంలోని ఎస్‌ఆర్‌ఈజీఎస్ (మహత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం)కు సంబంధించి ఒక అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్, ఒక ఇంజనీరింగ్ కన్సల్టెంట్, ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు, ఒక కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ ఉన్నారు. అయితే వీరు ఎవరూ సమయపాలన పాటించడం లేదు. ఉదయం11 గంటలకు దాటిన తర్వాతే వారు కార్యాలయానికి వస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో ఎప్పుడు వెళ్లిన సిబ్బందికి బదులు ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఏదైనా పనికోసమని ప్రజలు ఈ కార్యాలయానికి వస్తే సిబ్బంది వచ్చే వరకు వేచి చూడాల్సిందే. ఎస్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ఏడాదికి దాదాపు రూ. రెండు కోట్ల మేర పనులు జరుగుతున్నప్పటికీ సిబ్బంది అలసత్వంపై అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ విషయమై గ్రామస్తులు పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.


కంది ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

వెల్దుర్తిలో దొంగల హల్‌చల్

వెల్దుర్తి, జూలై 19 : మండల కేంద్రమైన వెల్దుర్తిలో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. రెండు ఇళ్లలో దోపిడీ చేయగా, మరో మూడు ఇళ్లలో చోరికి ప్రయత్నించారు. ఎస్ఐ నవతగౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం... పట్టణానికి చెందిన మహ్మద్ రజియాబేగం, ఆవుసుల నాగరాణి, కిష్టంగారి రాజయ్య ఇంటి తాళాలు పగలగొట్టారు. వారి ఇంట్లో నుంచి సుమారు రూ.20వేల నగదు, 7తులాల వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే పట్టణానికి చెందిన మరో రెండు ఇళ్లలో చోరికి ప్రయత్నించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలానికి వెల్దుర్తి పోలీసులు, క్లూస్‌టీం చేరుకుని వివరాలను సేకరించారు. ఇదిలా ఉండగా 20 రోజుల క్రితం వెల్దుర్తి పట్టణంలోని తిరుమల వైన్స్‌కు దొంగలు కన్నం వేశారు. ఈ ఘటన మరవక ముందే మళ్లీ దొంగలు చెలరేగిపోయారు.

హరీశ్ రాజీనామా చేసి మాట నిలుపుకోవాలి.

● టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి

నంగునూరు, జూలై 19 : రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పంట రుణాల మాఫీ హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేశారని, అలాగే మాజీ మంత్రి హరీశ్‌రావు మాట తప్పకుండా తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. శుక్రవారం నంగునూరులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించి అమలు చేసి రైతుల్లో సంతోషాన్ని నింపిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని మాజీ మంత్రి హరీశ్‌రావు విసిరిన సవాలు నిలుపుకోవాలని లేకుంటే రాజీనామా చేసేంత వరకు విడిచి పెట్టబోమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అచ్చిన సత్తయ్య, ఎంపీటీసీ ఎనగందుల నితిన్, గౌరబోయిన సంపత్, అనరాజు నాగరాజు, చెలికాని యాదగిరి, గోనెపల్లి శివగౌడ్, జంగిటి శ్రీనివాస్, రాగుల కృష్ణ, బాలయ్య, రంగు అశోక్, గాండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం కౌన్సిలర్‌పై అనర్హత వేటు

- ఓసీ అయి ఉండి.. బీసీ జనరల్ స్థానం నుంచి పోటీ
- అనర్హురాలిగా ప్రకటించిన సంగారెడ్డి జిల్లా కోర్టు



అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి కోర్టు ఆదేశాల కాపీలు అందజేస్తున్న బొల్లారం కాంగ్రెస్ నాయకులు

జిన్నారం, జూలై 19 : సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ పరిధి బీసీ జనరల్ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున కౌన్సిలర్‌గా గెలిచిన మహిళా కార్పొరేటర్‌పై జిల్లా కోర్టు అనర్హత వేటు వేసింది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఓసీ సామాజిక వర్గానికి చెందిన బి.శైలజ బీసీ జనరల్ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. స్వతంత్ర అభ్యర్థి నర్సింహారాజుపై గెలుపొందగా, నర్సింహారాజు బి. శైలజ బీసీ కాదని, ఆమెది ఓసీ సామాజికవర్గమని కోర్టును ఆశ్రయించారు. దీంతో విచారణ జరిపి కోర్టు శైలజను అనర్హురాలిగా ప్రకటించింది. రెండో స్థానంలో ఉన్న నర్సింహారాజును కౌన్సిలర్‌గా ప్రకటించాలని తీర్పు చెప్పింది. ఈ మేరకు ఉత్తర్వులు ఈ నెల 13నే విడుదల అయ్యాయి. కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిశారు. ఆయనను కలిసిన వారిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాలమ్మ, నాయకులు లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజ్‌గోపాల్, వెంకటయ్య, ప్రవీణ్‌రెడ్డి, నర్సింహారాజు ఉన్నారు.

ప్రేమించి మోసం చేసిన వ్యక్తిపై అత్యాచారం కేసు నమోదు

సిద్దిపేట క్రైం, జూలై 19 : ప్రేమించి పెళ్లి చేసుకుంటానని అమ్మాయిని మోసం చేసిన వ్యక్తిపై టూ టౌన్ పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం... హుస్నాబాద్ పట్టణం ఎల్లమ్మ బజార్ చెందిన జాలిగామ శ్రీనివాస్ కొన్ని రోజులుగా సిద్దిపేట పట్టణానికి చెందిన ఒక అమ్మాయితో సోషల్ మీడియా అయిన ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యాడు. ప్రేమిస్తున్నానని చెప్పి నమ్మించి పెళ్లి చేసుకుంటానని అవసరాలకు వాడుకున్నాడు. పెళ్లి చేసుకోకపోవడంతో బాధితురాలు సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గత నెల 23న ఫిర్యాదు చేయగా అతడిపై అత్యాచారం కేసు నమోదు చేసి శుక్రవారం పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

యువకుడు మృతి.. మరొకరి పరిస్థితి విషమం

గజ్వేల్, జూలై 19: కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టగా యువకుడు మృతిచెందిన ఘటన గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే పట్టణ పరిధిలోని మల్లన్నసాగర్ ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన నిమ్మరాజు రాజేశ్(19) తన స్నేహితుడు శంభయ్యగారి మురళీ(24)తో కలసి గురువారం అర్ధరాత్రి దాటాక గజ్వేల్ నుంచి ప్రజ్ఞాపూర్ వైపునకు కారులో వెళ్తున్నారు. మురళీ కారు నడుపుతుండగా, రాజేశ్ పక్క సీట్లో కూర్చుని ఉన్నారు. ఈ క్రమంలో యూనియన్ బ్యాంకు ఎదురుగా ప్రజ్ఞాపూర్ వైపునకు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పిన కారు చెట్టును బలంగా ఢీకొట్టింది. అనంతరం పక్కన ఉన్న ఎస్‌వీ క్లినిక్ ఇనుప మెట్లకు ఢీకొట్టగా నిమ్మరాజు రాజేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మురళీ తీవ్రగాయాల పాలవగా, 108 సహాయంతో పోలీసులు రాజేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి, మురళీని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయమై నిమ్మరాజు రాజేశ్ తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు.

నీట మునిగి యువకుడి మృతి

హత్నూర, జూలై 19 : ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన హత్నూర మండల పరిధిలోని చింతల్‌చెర్వు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం... చింతల్‌చెర్వు గ్రామానికి చెందిన అంబటి రమేష్(29) నెల రోజుల నుంచి గ్రామ శివారులోని అంబటివారి కుంటలో ఉన్న చేపలకు కాపరిగా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి అంబటివారి కుంట వద్దకు వెళుతున్నానని చెప్పాడు. రాత్రికి రమేష్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు శుక్రవారం ఉదయం కుంట వద్దకు వెళ్లగా.. కట్టపై బైక్‌తో పాటు చెప్పులు కనిపించాయి. కుంటలోని నీటిలో రమేష్ మృతదేహం తేలుతూ కనిపించింది. మృతుడికి నెల రోజుల క్రితమే పెళ్లి జరగగా, మృతుడి భార్య వీరమణి రోదన మిన్నంటింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

రాయపోల్, జూలై 19 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ పోలీసులు శుక్రవారం మండలపరిధిలోని అంకిరెడ్డిపల్లి వద్ద పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని అంకిరెడ్డిపల్లి వద్ద పోలీసులు, టాస్క్‌బృందం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అటువైపుగా వచ్చిన ఓ టాటాఏస్ వాహనాన్ని ఆపారు. అందులో 18 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని గుర్తించారు. రేషన్‌బియ్యాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా రాజంపేట నుంచి ఓ రైస్‌మిల్‌కు తరలిస్తున్నట్లు వాహన డ్రైవర్ భాస్కర్ తెలిపాడని పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి బియ్యాన్ని దౌల్తాబాద్ ఎంఎల్ఎస్ పాయింటుకు తరలించారు. వాహనాన్ని పోలీసుస్టేషన్‌లో అప్పగించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

నిజాంపేటలో టిప్పర్ బీభత్సం..



దుకాణాల వైపు దూసుకొచ్చిన టిప్పర్ లారీ

నిజాంపేట, జూలై 19 : మండల కేంద్రమైన నిజాంపేటలో శుక్రవారం టిప్పర్ లారీ బీభత్సం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. మెదక్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న ఏపీ 29 వి 8563 నంబరు గల టిప్పర్ లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో బీభత్సం సృష్టించింది. బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కనే ఆగి ఉన్న లారీని గమనించక అదుపు చేయు క్రమంలో టిప్పర్ రెండు ద్విచక్ర వాహనాలపై దూసుకెళ్లింది. టీఎస్ 23 ఈ 3588 నంబర్ గల ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జవ్వగా, మరొక ద్విచక్ర వాహనం స్వల్పంగా దెబ్బతింది. వాహనదారుల ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి తెలిపారు.

ఇస్రో ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన



శివ్వంపేట ఉన్నత పాఠశాలలో ఇస్రో స్పేస్ ఆన్ వీల్ బస్సు

శివ్వంపేట, జూలై 19 : శివ్వంపేట ఉన్నత పాఠశాలలో గ్రామీణ కృషి విజ్ఞాన సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో శుక్రవారం ఇస్రో ప్రయోగాలపై అవగాహన కల్పించారు. దొంతి, కొంతాన్‌పల్లి, చండీ ఉన్నత పాఠశాలలు, సత్యం విద్యా మందిర్, కేజీబీవీ విద్యార్థులకు స్పేస్ ఆన్ బస్సు'లో డెమో ప్రదర్శన ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇస్రో ఎస్‌పీడీవో వివి గణేషన్, టెక్నీషియన్ అసిస్టెంట్ ఎస్.రామయ్య, ఎంఈవో బుచ్చానాయక్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లల్లో చొరబాటు

- పనులు జరుగుతుండగానే ఆక్రమణ
- ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరింపులు
- రెవెన్యూ అధికారులకు కాంట్రాక్ట్ కంపెనీ ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

మెదక్ మున్సిపాలిటీ, జూలై 19 : గత ప్రభుత్వ హయాంలో మెదక్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఆక్రమణకు గురవుతున్నాయి. మొదటి విడతగా కొందరికి ఇళ్లను మంజూరు చేసి పట్టాలను పంపిణీ చేయగా, దరఖాస్తు చేసుకున్నా వారిలో ఇళ్లు రాని వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. తమకు ఎప్పుడిస్తారోనని ఎదురుచూసిచూసీ నీరసించిన పేద కుటుంబాలు ఇళ్లల్లో చిన్నచితక పనులు కొనసాగుతుండగానే చొరబడుతున్నారు.

500 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో..

మెదక్‌కు అప్పటి ప్రభుత్వం 1000 ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో మొదటి విడతగా 500 నివాసాలను పూర్తి చేసి ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. గత ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాటి మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా 500 పట్టాలను నిరుపేదలకు అందజేశారు. మిగతా 500 ఇళ్ల పనులు వివిధ దశలో ఉండగా నమ్యశ్రీ అనే కంపెనీ మరికొన్ని నివాసాలు పూర్తి చేసేందుకు పనులు ప్రారంభించింది. రెండు నెలలుగా గోడలు, ప్లాస్టరింగ్ పనులను పూర్తి చేసి ప్రస్తుతం ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నారు.

30 కుటుంబాలకుపైగా..

మరికొన్ని రోజులైతే పనులు పూర్తవుతాయనగా 30 కుటుంబాలకుపైగా ఇళ్లలోకి చొరబాటుకు దిగారు. ఇళ్లను ఆక్రమించుకున్న వారిని అక్కడ పనులు చేస్తున్న కాంట్రాక్ట్ కంపెనీ సిబ్బంది ప్రభుత్వం ఇచ్చిన పట్టాలేమైనా ఉన్నాయా అని ప్రశ్నించగా దౌర్జన్యం చేస్తూ దుర్భాషలాడినట్లు తెలిసింది. ఇదేంటని ప్రశ్నిస్తే దాడులకు సైతం పాల్పడుతున్నారని సదరు సంస్థ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండుమూడు ఇళ్లకు డోర్లు లేకపోతే అవికూడా వారే తెచ్చుకొని బిగించి నివాసాల్లో చొరబడ్డారు. డబుల్ ఇళ్లను ఆక్రమించుకోవడమే కాకుండా తమ ఇళ్లలో పూర్తిస్థాయిలో పనులు చేయలేదని నిత్యం వాదోపవాదాలకు దిగుతున్నారు.





డోర్ ఏర్పాటు చేసుకుని దానిపై రాసుకున్న పేరు

రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

ఇవే కాకుండా ఇదివరకే పట్టాలు పంపిణీ చేసి ఇంటి నంబరు కేటాయించిన వాటిలోకి సైతం కొంతమంది చొరబడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కొంతమంది అయితే ఈ ఇల్లు తమదంటూ గోడలు, డోర్లపై పేర్లు, ఫోన్‌నంబర్లు రాసుకొని వెళ్తున్నారు. ఈ విషయమై సదరు కాంట్రాక్ట్ సంస్థ రెవెన్యూ అధికారులకు సైతం ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

నాయకుల అండదండలతోనే...

మొదటి విడతగా 500 నివాసాల పట్టాలు పంపిణీ చేసి.. రెండో విడతలో మిగతా వారికి ఇస్తామని చెప్పడంతో ఎన్నో ఆశలతో ఎదురుచూసిన పేదలకు నిరాశే మిగిలింది. ఎన్నాళ్లు చూసినా డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వడం లేదని పేదలు కొంతమంది నాయకుల అండదండలతో డబుల్ బెడ్‌రూంలలోకి చొరబడుతున్నారు. పట్టణానికి చెందిన కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే పట్టాలు లేకున్నా ఆక్రమించుకుంటున్నట్లు తెలిసింది. ఇలా ఆక్రమించుకున్న వారు సదరు కాంట్రాక్ట్ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతూ మీరెవరూ వద్దనడానికంటూ బూతుపురాణాలు వినిపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోతే పనులు ఎక్కడికక్కడే నిలిపివేసి వెళ్తామని కాంట్రాక్ట్ సిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆశావాహులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



సొంత ఖర్చుతో డబుల్ బెడ్‌రూంకు డోర్ ఏర్పాటు చేసుకుని తాళం వేసుకున్న ఆక్రమణదారులు

హాస్టల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు చెల్లించాలి

కలెక్టరేట్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుని కలిసి ఆవేదన

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 19: ఏడు నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నామని ప్రభుత్వ ఎస్సీ, బీసీ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది శుక్రవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు చెల్లించడం భారంగా మారిందని, పీఎఫ్ డబ్బు సైతం జమచేయడం లేదని వాపోయారు. వారు కలెక్టర్ కార్యాలయంలో గంటల తరబడి కలెక్టర్ కోసం చూడగా.. కలెక్టరేట్‌కు హరీశ్‌రావు రాగా, ఆయనకు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా స్పందించిన హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ సర్కారుకు ఈ చిరు ఉద్యోగుల వెతలు కనిపించడం లేదా? తక్షణమే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలకు పరిష్కారం చూపాలని, ఏడు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



హరీశ్‌రావుతో మాట్లాడుతున్న వసతి గృహాల ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

కొండపాక ఫిషరీస్‌కు జాతీయస్థాయి గుర్తింపు

కొండపాక, జూలై 19 : కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ పనితీరుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇటీవల తమిళనాడు రాష్ట్రంలోని మదురైలో నిర్వహించిన జాతీయ స్థాయి మత్స్య శిఖరాగ్ర సమావేశంలో కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ తరఫున ప్రతినిధులు టి.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంకను పాలకవర్గం కలిసింది. వారికి కమిషనర్ సర్టిఫికెట్‌ను అందజేశారు. 500 మంది ముదిరాజ్ మత్స్యకారుల భాగస్వామ్యంతో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ప్రయోజనాలను పొందేలా కృషి చేస్తున్న పాలకవర్గాన్ని, కంపెనీ సీఈవో నారదాసు, ఈశ్వర్‌ను అభినందించారు.



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంక

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి

జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

జహీరాబాద్, జూలై 19 : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో 708 మంది లబ్ధిదారులకు రూ.7.08 కోట్ల విలువ చేసే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాటకు కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండ అమలు చేసి తీరుతామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రుణమాఫీ పథకం చారిత్రాత్మకమన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి ఆదరాభిమానాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలు తీసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఆర్డీవో రాజు, తహసీల్దార్‌లు రవీందర్, సంజీవరావు, ఆయా మండలాలకు చెందిన పార్టీల అధ్యక్షులు హన్మంతరావుపాటిల్, నర్సింహారెడ్డి, రామలింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్, పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకునే పార్టీ

రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు

సిద్దిపేట టౌన్, జూలై 19 : ఇచ్చిన మాట నిలబెట్టుకునే కల్చర్ కాంగ్రెస్ పార్టీదేనని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు, రైతులకు రూ.2లక్షల రుణమాఫీని అమలు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇస్తున్నట్లుగానే త్వరలోనే పెన్షన్ కూడా అమలు చేస్తామని చెప్పారు. ఆగస్టు 15లోపు రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేస్తామన్నారు. కొందరు రైతులు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేయలేకపోవడంతో వారి ఖాతాల్లో నగదు జమకావడం లేదని, అందుకు ఎవరూ బాధపడవద్దన్నారు. పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ చేయని పనులను, ఏడు నెలల్లో సీఎం రేవంత్ రెడ్డి చేస్తే, బీఆర్ఎస్ నాయకులు లేనిపోని వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చడంతోనే కేసీఆర్ పని సగం అయిపోయిందని ఎద్దేవా చేశారు. 2019లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను, కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకోలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడి ఇతర పార్టీల నుంచి స్వచ్ఛందంగా ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరి భాగస్వామ్యులవుతున్నారని చెప్పారు. కేంద్రంలో మోదీ నోట్లు రద్దుచేసి ప్రజలను ఇబ్బందులు పెట్టారని, ఆయన హయాంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాని ప్రశ్నించారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క

మెదక్ కల్చరల్, జూలై 19 : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర గ్రామీణ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. శుక్రవారం అన్ని జిల్లాల డీఎల్‌పీవోలు, డీపీవోలతో మంత్రి సీతక్క వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు సూచనలను చేశారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులు పర్యటించి రోజువారి కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్ లీకేజీలను అరికట్టాలని సూచించారు. పంచాయతీ కార్యాలయాల్లో ఫాగింగ్ మిషన్లు, సరిపడా బ్లీచింగ్ పౌడర్, ఆయిల్‌బాల్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంపీఓ, ఏపీవో, మండల స్పెషల్ ఆఫీసర్లతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మెదక్ కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

బంగ్లాదేశ్ అధికారులకు పాలన విధానాలపై అవగాహన కల్పించిన మెదక్ కలెక్టర్



బంగ్లాదేశ్ అధికార బృందానికి అవగాహన కల్పిస్తున్న రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 19 : బంగ్లాదేశ్ అధికార బృందానికి దేశ పాలన విధానాలపై మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అవగాహన కల్పించారు. నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎన్‌సీజీజీ) ఆధ్వర్యంలో 16 మంది బంగ్లాదేశ్ డిప్యూటీ కమిషనర్లకు పబ్లిక్ పాలసీ, గవర్నెన్స్‌పై శుక్రవారం ఢిల్లీలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని బంగ్లాదేశ్ డిప్యూటీ కమిషనర్లకు భారత కేంద్ర మంత్రిత్వశాఖ పరిధిలోని పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, భారతీయ పాలన, ప్రజా విధానాలను వివరించారు. సుపరిపాలనను ప్రోత్సహించడం, ప్రాధాన్యతా రంగా కార్యక్రమాలను అమలు చేయడంలో దేశంలోని జిల్లా కలెక్టర్లు చేసిన ఆదర్శప్రాయమైన పని గురించి తెలిపారు. ప్రస్తుతం దేశంలో చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన వివరించారు. గతంలో ఇన్నోవేటర్ ప్రోగ్రాంలో భాగంగా గుర్తింపుగా వచ్చిన ప్రధాన మంత్రి అవార్డుకు సంబంధించిన వివరాలను తెలిపారు. అవగాహన కల్పించిన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఆయా శాఖల ఉన్నతాధికారులు మెమొంటోను అందజేశారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

సంగారెడ్డి జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి

హత్నూర, జూలై 19: బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సంగారెడ్డి జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి అన్నారు. మండల కేంద్రమైన హత్నూర కేజీబీవీలో శుక్రవారం మిషన్ శక్తి వంద రోజుల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు క్యాంపులో నేర్పిస్తున్న ప్రతీ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, సఖీ సీఏ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

పాత 'బడి' పోయింది..!

- 77 ఏళ్ల నాటి మద్దూరు హైస్కూల్‌పై నిర్లక్ష్యం
- నిధులున్నా ముందుకు సాగని పనులు






బయట ప్లాస్టరింగ్ చేసి పెయింటింగ్ వేయకుండా వదిలేసిన మద్దూరు హైస్కూల్ పాత భవనం, ప్లాస్టరింగ్ చేయని తరగతి గది

మద్దూరు, జూలై 19 : అలనాటి మద్దూరు హైస్కూల్ పాతబడి కళావిహీనంగా తయారవగా ఆధునికీకరణకు గత ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎట్టకేలకు మరమ్మతు పనులు కొనసాగుతున్నాయనుకుంటే నిర్లక్ష్యం నీడ కమ్ముకున్నది. ఇటీవల సర్కారు మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరైనా ఈ పనులు కూడా అసంపూర్తిగానే మిగిలాయి.

నిధులు మంజూరైనా నిర్లక్ష్యం

మద్దూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలది 77 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర. 1947లోనే పాఠశాల ప్రారంభం కాగా, 1950 సంవత్సరంలో 13 గదులతో పక్కా భవనాన్ని నిర్మించారు. దంగు సున్నంతో నిర్మాణం చేపట్టిన పాతకాలం నాటి భవనంలోనే చదువులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలను ఆధునీకరించేందుకు మన ఊరు - మన బడి పథకం ద్వారా రూ.54.31 లక్షలు మంజూరయ్యాయి. కిచెన్‌షెడ్, డైనింగ్‌హాల్, విద్యుదీకరణ, బాలికలకు టాయ్‌లెట్ల నిర్మాణం పనులతో పాటు పాఠశాల పునరుద్ధరణ పనులను చేపట్టారు. కిచెన్‌షెడ్, డైనింగ్‌హాల్, విద్యుత్‌తో పాటు టాయ్‌లెట్ నిర్మాణ పనులను చేపట్టినా అసంపూర్తిగానే ఉన్నాయి. రెండేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాలేవు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. నీటి వసతికి సంపు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గదులకు ప్లాస్టరింగ్ పనులు చేపట్టాల్సి ఉండగా కేవలం రెండింటి పనులే పూర్తయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలకు అత్యవసర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకం కింద రూ.2.95 లక్షలను మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన మూత్రశాలల పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కేవలం పాఠశాల ఎంట్రెన్స్‌లో గేటు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.

పనుల పూర్తికి అధికారులు చొరవ తీసుకోవాలి



విద్యాసంవత్సరానికి ముందే పనులు పూర్తి చేయాల్సి ఉన్నా కాంట్రాక్టర్ సకాలంలో చేయలేదు. దీంతో విద్యార్థులు పాఠశాలకు రావడానికి విముఖత చూపిస్తున్నారు. విద్యాబోధన చేయడంలో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. అసంపూర్తి పనులు తొందరగా చేపట్టే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలి. పాఠశాల పెయిటింగ్ కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశాను. పాఠశాలకు స్వీపర్‌తో పాటు స్కావేంజర్‌ను వెంటనే నియమించాలి.

- చంద్రశేఖర్‌శర్మ, హెచ్‌ఎం

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

● సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట రూరల్/నారాయణరావుపేట, జూలై 19: కాంగ్రెస్ అంటేనే రైతుల శ్రేయస్సు కోసం పని చేసే ప్రభుత్వమని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గం ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి, ఇర్కోడు, నారాయణరావుపేట మండల కేంద్రంలో రుణామాఫీ సందర్భంగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల బృందం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ఎలాగైతే రైతు కళ్లల్లో ఆనందం, వ్యవసాయం అంటే పండుగలా చేసాడో నేడు సీఎం రేవంత్‌రెడ్డి రైతుల మేలుకోసం గొప్ప యజ్ఞానికి పూనుకున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బాలకృష్ణరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, సీనియర్ నాయకులు నాయిని నర్సింహారెడ్డి, మంద పాండు, డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్, పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు గరిపల్లి రాములు, పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రం, ఫిషర్మేన్ రాష్ట్ర కార్యదర్శి గౌటి బాబేష్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **మిరుదొడ్డి:** ప్రజాసంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మిరుదొడ్డిలో రాష్ట్రప్రభుత్వం రైతురుణమాఫీ చేయడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో 29వేల కోట్లు ప్రజాసంక్షేమం కోసం ఖర్చుచేసిందని గుర్తు చేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామిగౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌నర్సాగౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌రెడ్డి, మిరుదొడ్డి పీఏసీఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి, కాంగ్రెస్ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు మద్దెల రాజేశం, మాజీ ఎంపీపీ సాయిలు పాల్గొన్నారు.

● **దౌల్తాబాద్:** మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పడాల రాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రాపటానికి క్షీరాభిషేకం చేశారు.

● **వర్గల్:** మండలంలోని మైలారంలో అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాల వద్ద కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గౌండ్ల కుమార్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

● **చిన్నకోడూరు:** చిన్నకోడూరులో రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీకి కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండలాధ్యక్షుడు బంక చిరంజీవి యాదవ్ క్షీరాభిషేకం చేశారు.

● **కుకునూరుపల్లి:** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరుపాక శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వీరేశం, పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహచారి, మాజీ సర్పంచులు పోల్కంపల్లి నరేందర్, మిట్టపల్లి రుషి, మాజీ ఎంపీటీసీలు మహేందర్, కనకయ్య, రెడ్డమైన రవీందర్, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● దూళిమిట్ట,జూలై 19: మండలంలోని హనుమతండా కాంగ్రెస్ గ్రామశాఖ అధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

● **కొండపాక:** రుణమాఫీ చేసిన సందర్భంగా మండలంలోని మర్పడగలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి క్షీరాభిషేకం చేశారు.

● **గజ్వేల్:** గజ్వేల్ మండలం జాలిగామలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బూర్గుపల్లి రాజిరెడ్డి, ఆంజనేయులు, కరుణాకర్‌రెడ్డి, రాములుగౌడ్, అజ్గర్, నర్సింహులు, శంకర్, మల్లయ్య, ఎల్లయ్య, చంద్రయ్య, నరసయ్య రాములు, తదితరులున్నారు.

● **హుస్నాబాద్:** రుణమాఫీ రైతులకు ఎంతో ఊరటనిచ్చిందని రైతు ఐక్యతా సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు.



మిరుదొడ్డి: కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



సిద్దిపేట రూరల్/నారాయణరావుపేట: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న హరికృష్ణ



దౌల్తాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రాపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కుకునూరుపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



దూళిమిట్ట: హనుమతండా గ్రామంలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చికిత్సపొందుతూ యువకుడి మృతి

దుబ్బాక, జూలై 19: పురుగుల మందును తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన దుబ్బాక మండలం కమ్మర్‌పల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకున్నది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాంతుల నందకుమార్(19)అనే యువకుడు ఏడు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఖాళీగా ఉంటున్న అతడిని ఏదైనా పనిచేసుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు ఈనెల 17న గడ్డిమందు తాగాడు. అతడి స్నేహితుడి ద్వారా ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేటకు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆస్తి తగాదాల నేపథ్యంలో వ్యక్తి అదృశ్యం

వర్గల్, జూలై 19: మండలంలోని వేలూర్‌కు చెందిన చింతకింది మహేశ్ (35)అనే వ్యక్తి అదృశ్యమైయ్యాడు గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు వద్ద, చుట్టపక్కల గ్రామాల్లో గాలించినా అతడి ఆచూకీ లభించలేదు. అన్నదమ్ముళ్ల నడుమ ఆస్తి తగాదాలు పరిష్కారం కాకపోవడంతో తీవ్రమనస్తాపం చెంది తన భర్త ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు గౌరారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.



మహేశ్(ఫైల్)

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జూలై 19: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డిల అమరుల భవనంలో శుక్రవారం హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచి నేటి వరకు ఈ ప్రాంతంలో అనేక పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐకి ఉందని, ఇంతటి ఘనచరిత్ర కలిగిన సీపీఐని గ్రామగ్రామాన బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, జాగీర్ సత్యనారాయణగౌడ్, ఎడల వనేష్, కొమ్ముల భాస్కర్, అయిలేని సంజీవరెడ్డి, కొయ్యడ కొంరయ్య, గూడ పద్మ, జేరిపోతుల జనార్ధన్, మల్లారెడ్డి తదితరులున్నారు.

'ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలి'

గజ్వేల్, జూలై 19: ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రుణాలు పొందిన ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, చాలామంది రైతుల పేర్లు లేకుండా జాబితాను విడుదల చేయడం సరికాదన్నారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీని వర్తింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై రైతుల పక్షాన పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే హరీశ్‌రావు తాను విసిరిన సవాళుకు కట్టుబడి ఉన్నారని, ఆరు గ్యారంటీలు, 11హామీలను అమలు చేస్తే రాజీనామా చేస్తానని ఇప్పటికే ప్రకటించారన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు ప్రగల్భాలు పలకడం మాని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకై చిత్తశుద్ధితో కృషిచేయాలన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య



శివాలయ భూముల వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

గజ్వేల్, జూలై 19: గజ్వేల్ పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య కోరారు. గజ్వేల్ పట్టణంలోని శివాలయం భూముల వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములకు గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేయాలన్నారు. పట్టణంలో ఇప్పటికే అనేక చోట్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, మిగిలిన భూములను కబ్జా చేసేందుకు ఎంతో మంది యత్నిస్తున్నారన్నారు. ఐఓసీ వెనకాల ఉన్న ప్రభుత్వ భూమికి ప్రహరి నిర్మించాలన్నారు. వారితో సీపీఎం నాయకులు రంగారెడ్డి, బండ్ల స్వామి, అహ్మద్, వెంకటాచారి తదితరులున్నారు.

'కబ్జాదారుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

చేర్యాల, జూలై 19: కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లిలో దళితుడి స్థలాన్ని ఆక్రమించడంతో పాటు అతడి కిరాణా దుకాణ షెడ్డును ధ్వంసం చేయించిన బూరుగు అంజయ్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ కరికె భీమసేన, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్ది లింగన్నగారి శంకర్, జాతీయ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారయణ డిమాండ్ చేశారు. ఈవిషయమై శుక్రవారం వారు కొమురవెల్లిలో మాట్లాడారు. గ్రామానికి చెందిన తుక్కోజు సులోచనకు వారసత్వంగా సంక్రమించిన భూమిలో షెడ్డువేసుకుని కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనంసాగిస్తున్నారని, ఆ స్థలం తమదని బూరుగు అంజయ్య ఇబ్బందులకు గురిచేస్తుండటం తగదన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వీరి వెంట నాయకులు మండల యాదగిరి, జక్కుల రాజయ్య, తుక్కోజి సతీశ్, ఏగొండ స్వామి తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌ను విమర్శించే హక్కులేదు'

మిరుదొడ్డి, జూలై 19: దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పరిస్థితి మూడు ముక్కలాటగా మారిందని, బీఆర్ఎస్‌ను విమర్శించే నైతిక హక్కులేదని బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పాపని సురేశ్‌గౌడ్ ఆరోపించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూ. 10వేలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులను మభ్యపెట్టడానికే రుణమాఫీ చేశారన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కొంతమంది కాంగ్రెస్ నాయకులు అవాకులు చవాకులు పేల్చుతున్నారని, వారు ఆ పద్ధతి మార్చుకుంటే మంచిదన్నారు. దుబ్బాకలోని కాంగ్రెస్‌లో రెండు వర్గాలున్నాయని, మొదట దాన్ని పరిష్కరించుకోవాలని హితువు పలికారు.

చేర్యాల మునిసిపల్‌లో అటకెక్కిన డ్రైడే



చేర్యాల మునిసిపల్ కార్యాలయం

చేర్యాల, జూలై 19: పరిసరాల పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించడంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రభలకుండా అప్రమత్తం చేసేందుకు ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాల్సి ఉన్నా చేర్యాల మునిసిపల్‌లో అమలు చేపట్టడం లేదు. గతంలో ప్రతీ శుక్రవారం ప్రజాప్రతినిధులు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది కలిసి వార్డులలో పర్యటించేవారు. కానీ కొంతకాలంగా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఫ్రైడే డ్రైడే అటకెక్కింది. వనమహోత్సవంలో భాగంగా పట్టణంలో మొక్కలు నాటిల్సి ఉన్నప్పటికీ సరైన కార్యాచరణ చేపట్టలేదు. రోడ్డువిస్తరణలో డ్రైన్‌కాలువ అసంపూర్తి పనుల కారణంగా మురుగునీటి మళ్లింపు ప్రధాన సమస్యగామారింది. ప్రజలు దోమలతో సహవాసం చేస్తున్న నేపథ్యంలో డెంగీ, డయేరియా ప్రభలే ప్రమాదం పొంచి ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వచ్చేవారం నుంచి నిర్వహిస్తాం: మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నర్సయ్య

శుక్రవారం ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించినందున హాజరు కాలేదు. వచ్చేవారం నుంచి ఫ్రైడే డ్రైడేను చేర్యాలలో నిర్వహిస్తాం. మునిసిపల్ సిబ్బంది యధావిధిగా పారిశుధ్య పనులు కొనసాగిస్తున్నారు.

రుణమాఫీ చరిత్రాత్మకం

మిరుదొడ్డి, జూలై 19: సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా చేసిన రైతు రుణమాఫీ చరిత్రాత్మక నిర్ణయమని మిరుదొడ్డి పీఏసీఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి డైరీఫాం రైతులు కుంట అనిల్‌కు 2లక్షల 9వేలు, నీలగాలయ్యకు 2లక్షల 4వేల 518రూపాయాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సీఈవో రాజు, భగవాన్‌రెడ్డి ఉన్నారు.

వేలం వాయిదా

చేర్యాల, జూలై 19: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించతలపెట్టిన సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం వాయిదా పడింది. తలనీలాల సేకరణ, ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయం, శేషవస్త్రాలు, పసుపు, ఒడి బియ్యం సేకరణకు కొద్దిరోజులుగా పలుమార్లు టెండర్లు చేపట్టినా గతేడాది కన్నా తక్కువ పాటరావడంతో వాయిదావేసి శుక్రవారం నిర్వహించ తల పెట్టారు. కానీ హైదరాబాద్‌లోని బోనాల నిర్వహణకు సంబంధించిన కార్యక్రమంలో ఈవో బాలాజీశర్మ విధిగా పాల్గొనాల్సిన ఉన్నందున మరోమారు వాయిదా వేశారు. వేలంను ఈనెల 23న చేపట్టనున్నట్లు తెలపడంతో పలువురు మధ్యాహ్నంలోగా దాఖలు చేసిన షెడ్యూల్స్ బాక్స్‌లో సీజ్‌చేశారు.

పంతులుతండా వాసికి డాక్టరేట్

అక్కన్నపేట, జూలై 19: మండలంలోని పంతులుతండాకు చెందిన కరంటోతు మోతిలాల్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఖాసీంపూర్‌లోని గ్లోకల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో అనాలసీస్ ఆఫ్ ఫ్లెక్సీబుల్ ఫీక్చర్ సెటప్ అండ్ అప్టిమైజేషన్ బీఫోర్ మిల్లింగ్ ఆపరేషన్ అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మోతిలాల్ మాట్లాడుతూ.. తనను ప్రోత్సహించిన కుటుంబసభ్యులకు, బంధుమిత్రులకు, తండావాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. మోతిలాల్ డాక్టరేట్ సాధించడం పట్ల తండావాసులు హర్షంవ్యక్తం చేశారు.

పేకాట స్థావరంపై దాడి

సిద్దిపేట క్రైం, జూలై 19 : సిద్దిపేట పట్టణంలోని ఓ గార్డెన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం కొంత మంది పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయం సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7770, నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా చౌరస్తా

చేర్యాల, జూలై 19: చేర్యాల పట్టణంలోని ప్రధాన ల్యాండ్‌మార్క్‌గా ఉన్న అంగడిబజారు క్రాస్‌రోడ్డు అధ్వానంగా మారింది. కూడలి వద్ద తెలంగాణతల్లి విగ్రహం, అమరవీరుల స్మారకస్థూపం, స్వాతంత్ర్య సమరయోధుడి స్మారకస్థూపం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఉండటంతో పాటు ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్ ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డువిస్తరణలో భాగంగా కొద్దిరోజులక్రితం డ్రైన్ కాలువ నిర్మించి అమరవీరుల స్మారకస్థూపం ఆవరణలో నిలిపివేయడంతో పాటు అంబేడ్కర్ కూడలి ప్రదేశం పల్లంగా ఉండటంతో మురుగునీరు చేరి అధ్వానంగా మారుతుంది. దీంతో ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నా మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, జూలై 19: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఆయా వార్డుల్లో మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్యతో కలసి పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం మునిసిపల్ పరిధిలోని 3వ వార్డులో డ్రైడే-ఫ్రైడేని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ఆయనవెంట కౌన్సిలర్లు బాలమణి, వరలక్ష్మికనకయ్య, రజిత, రహీం, మునిసిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మనుగడకు చెట్లే ప్రాణాధారం

మానవ మనుగడకు చెట్లే ఆధారమని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పీవీ ఉమాశశి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏక్ పేడ్ మాకేనాం అభ్యాస్ కార్యక్రమంలో భాగంగా జాతీయ సేవా పథకంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమ్మ పేరు మీద మొక్కలను నాటాలని, మానవ సమాజ మనుగడకు స్వచ్ఛమైన గాలి ఆధారమన్నారు. ఆమెవెంట ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కస్తూరి భాయి, జయరాజు, వలంటీర్లు భార్గవి, లయ, నిఖిత, సంధ్య, రమ్య, అధ్యాపకులు కవిత, భావన, నీలిమ, శిరీష, సంపత్, వంశీ ఉన్నారు.



సిద్దిపేట టౌన్: మునిసిపల్ కార్యాలయంలో మొక్కలకు నీరుపడుతున్న మునిసిపల్ కమిషనర్



గజ్వేల్: పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ ఉమాశశి

నాటిన మొక్కలను సంరక్షించాలి

సిద్దిపేట టౌన్, జూలై19: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి సూచించారు. సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం కమిషనర్ ప్రసన్నరాణి మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్దిపేట పట్టణంలో ఎక్కడ చూసినా పచ్చదనం ఉండేలా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి కాపపాడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్, కనకరాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

'ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనాన్ని చెల్లించాలి'



వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

దుబ్బాక, జూలై 19: ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనాన్ని చెల్లించాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవఅధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి పీఏకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆశావర్కర్లకు 18వేల ఫిక్స్‌డ్ వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కర్, ఆశావర్కర్లు భాగ్యలక్ష్మి, శారద, సంతోష, చంద్రకళ, స్వరూప, భారతీ, లత, వసుంధర, శోభ, మణేమ్మ, శ్యామల తదితరులున్నారు.

మానవత్వం చాటుకున్న చేర్యాల సీఐ



బాధితుడిని ఆస్పత్రికి తీసుకువస్తున్న సీఐ

చేర్యాల, జూలై 19: చేర్యాల సీఐ శ్రీను మానవత్వం చాటుకున్నారు. కొమురవెల్లి మండలం కిష్టంపేటకు చెందిన బొంగు తిరుపతిరెడ్డి స్థానిక మార్కెట్ వద్ద సొమ్మసిల్లిపడిపోయాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న చేర్యాల సీఐ శ్రీను గమనించి తిరుపతిరెడ్డిని తన పోలీసువాహనంలో ఎక్కించుకుని చేర్యాల ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అతడి కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు. స్థానికులు సీఐ శ్రీనును అభినందించారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

● తొగుట సీఐ లతీఫ్

రాయపోల్, జూలై 19: విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. మండలంలోని అనాజీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం షీటీం బృందం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, మహిళా రక్షణకు ఉన్న చట్టాలు, షీటీం నిర్వహిస్తున్న విధులను వివరించారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీటీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాలను వివరించారు. 10 జీపీఏ సాధిస్తే సన్మానించి రివార్డు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నిర్మల, షీటీం బృందం సభ్యులు శ్రీరాములు, ఎఎస్ఐ కృష్ణం రాజు, హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డి, కానిస్టేబుల్లు శ్యామల, రాంచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

సిద్దిపేట క్రైం జూలై 19: విద్యార్థులు క్రమశిక్షణ చదువుకోవాలని, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు జోలికి వెళ్లకూడదని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గ సూచించారు. సిద్దిపేట పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీం నిర్వహిస్తున్న విధులు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చటాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు బానిసలు కావద్దు అని, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌చారి, స్నేహిత మహిళ సపోర్టు సెంటర్ కోఆర్డినేటర్ వసంత, సిద్దిపేట షీటీం బృందం సభ్యులు కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణ కుమారి, కానిస్టేబుళ్ల ప్రవీణ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సిద్దిపేట క్రైం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ

అంగన్‌వాడీ ప్రీస్కూల్స్‌ను సద్వినియోగించుకోవాలి

● మునిసిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి



చేర్యాలలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్

చేర్యాల, జూలై 19: అంగన్‌వాడీ ప్రీస్కూల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని చేర్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి కోరారు. చేర్యాల పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలు-7,8,9,12 ఆధ్వర్యంలో చేపట్టిన అమ్మ మాట-అంగన్‌వాడీబాట కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. అలాగే చేర్యాల మండలం వేచరేణి, పోతిరెడ్డిపల్లి గ్రామాలలో కార్యక్రమం నిర్వహించారు.

● **ములుగు:** ములుగు మండలం తునికిబొల్లారంలో శుక్రవారం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశంతో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీడీపీవో సరిత తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మొహతాబ్, సునిత, ప్రైమరీ స్కూల్ టీచర్ ప్రవీణ, అంగన్‌వాడీ టీచర్లు జయసుధ, సుజాత, ఎఎన్ఎం విజయ, ఆశా సుకన్య, పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి

సిద్దిపేట టౌన్, జూలై 19: పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యతని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని 11వ వార్డులోని కాల్లకుంటకాలనీలో శుక్రవారం కౌన్సిలర్ దాసరి భాగ్యలక్ష్మిశ్రీనివాస్‌తో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతీ శుక్రవారం అందరూ డ్రైడే పాటించాలని తెలిపారు. ఇళ్ల వద్ద హౌజ్‌లో నీరు నిల్వ ఉండడం గమనించిన కమిషనర్ వెంటనే నీటిని తొలగింపచేశారు. వార్డులో వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో, మురికి కాలువలో దోమ లార్వా నివారణకై మలాథిన్ పిచికారి, నీటి ట్యాంక్ వద్ద అపరిశుభ్రంగా ఉండటం గమనించి వెంటనే పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించి, ట్యాంక్ చుట్టూ బ్లీచింగ్ వేయించారు. కార్యక్రమంలో అధికారులు మాధవి (శానిటరి ఇన్‌స్పెక్టర్) తదితరులు పాల్గొన్నారు.

● **జగదేవ్‌పూర్:** సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ జితేందర్‌రెడ్డి సూచించారు. జగదేవ్‌పూర్‌లో శుక్రవారం డ్రైడేను పురస్కరించుకుని ప్రతీ ఇంటికి వెళ్లి వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు స్వరూప, నిర్మల, కవిత తదితరులు ఉన్నారు.

● **మద్దూరు:** సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు సూచించారు. మండలకేంద్రంలో శుక్రవారం డ్రైడేను సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి వీధుల్లో పర్యటించారు. గ్రామపంచాయతీ సిబ్బందితో దోమల నివారణమందు పిచికారి చేయించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● **కొండపాక:** పరిసరాల పరిశుభ్రతతోనే ఎలాంటి వ్యాధులు దరి చేరవని కొండపాక మండలం మర్పడగ ప్రత్యేకాధికారి, కొండపాక తహసీల్దార్ దిలీప్‌నాయక్ తెలిపారు. శుక్రవారం గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని పేర్కొన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ మిషన్‌తో దోమల మందు పిచికారి చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మ, నాయకులు ఆంజనేయులు, తిరుపతిరెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

● **కుకునూరుపల్లి:** ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలని కుకునూరుపల్లి వైద్యాధికారిని పర్వీన్ సూచించారు. శుక్రవారం మెదినిపూర్ గ్రామాన్ని సందర్శించారు. వర్షాకాలం దృష్ట్యా డెంగీ, మలేరియా, ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందన ఇంటి పరిసరాల్లో నీరు నిల్ల ఉండకుండా చూసుకోవాలన్నారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం దేవలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్: ఇంటి ఆవరణలో నిల్వ ఉన్న మురుగునీటిని పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది



మద్దూరు: ఇంటి ఆవరణలో నిల్వఉన్న నీటిని పారబొస్తున్న పీహెచ్‌సీ, జీపీ సిబ్బంది